క్లుప్తంగా

గుజరాత్ సీఎంకి స్వాగతం



భూపేంద్రపటేల్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ నామినేషన్ కార్యక్రమం కోసం గురువారం కరీంనగర్ విచ్చేసిన గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌కు బీజేపీ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, ప్రతాప రామకృష్ణలతో పాటు ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్‌లు స్పోర్ట్స్ స్కూల్‌లోని హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం పలికారు. అనంతరం వారంతా గుజరాత్ ముఖ్యమంత్రితో కలిసి కరీంనగర్ కలెక్టరేట్‌కు చేరుకుని నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బొమ్మకల్‌లో బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీకి జెండా ఊపుతున్న బీజేపీ నాయకులు తిరుపతి, సుధాకర్

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ గురువారం కరీంనగర్ కలెక్టరేట్‌లో ఎంపీగా నామినేషన్ పురస్కరించుకుని కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల నుంచి బీజేపీ కార్యకర్తలు బైక్ ర్యాలీగా కరీంనగర్‌కు తరలివెళ్లారు. బొమ్మకల్, గుంటూరుపల్లి నుంచి బయలు దేరిన బైక్‌ర్యాలీకి బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి పాశం తిరుపతి జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిందం అశోక్, నాయకులు దాది సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ ఇన్‌చార్జి ఎస్‌ఈగా మహేందర్

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ ఎస్‌ఈగా ఈఈ మహేందర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎస్‌ఈగా ఉన్న నాగమల్లేశ్వరరావుపై వేటు పడిన తర్వాత ఎస్‌ఈగా మరెవరినీ నియమించలేదు. నెలల తరబడి ఆ పోస్టు ఖాళీగా ఉంది. ఈక్రమంలో ఈఈగా ఉన్న మహేందర్‌కు పూర్తి అదనపు బాధ్యతలతో ఎస్‌ఈగా నియమించారు. అలాగే ఏఈగా ఉన్న అయూబ్‌ఖాన్‌కు డీఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎస్‌ఈగా ఇన్‌చార్జి చేపట్టిన మహేందర్‌ను గురువారం పలువురు అభినందించారు.

రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపిక



శివజ్యోతి

విద్యానగర్(కరీంనగర్): నగరంలోని జ్యోతి ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ అధ్యక్షురాలు ఆకెనపల్లి శివజ్యోతి సమర్పించిన సైన్స్ పరిశోధన పత్రం రాష్ట్రస్థాయికి సైన్స్ సెమినార్‌కు ఎంపికైంది. గత ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్ర విద్యాశాఖ సైన్స్ అంశాలపై పరిశోధన పత్రాలను ఆహ్వానించగా శివజ్యోతి జీవన వైవిధ్యం, పర్యావరణ విజ్ఞాన విద్య సుస్థిరత పర్యావరణం అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించింది. ఈ సందర్భంగా శివజ్యోతిని పలువురు అభినందించారు.

కాంగ్రెస్ పార్టీ నగర సమన్వయ కమిటీ నియామకం

కరీంనగర్ కార్పొరేషన్: లోకసభ ఎన్నికల వేళ నగరంలో పార్టీ ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు కాంగ్రెస్ పార్టీ నగర సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. సమన్వయ కమిటీ కన్వీనర్‌గా మాజీ కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ వ్యవహరిస్తారు. సభ్యులుగా కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆరెపల్లి మోహన్, కోడూరి సత్యనారాయణగౌడ్, మాజీ కార్పొరేటర్లు మాచర్ల ప్రసాద మల్లికార్జున రాజేందర్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, సయ్యద్ వహాజొద్దీన్, నడిపెల్లి అశోక్‌రావు, ఆరిఫ్ మహమ్మద్‌లను నియమించినట్లు డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌గౌడ్ ఆదేశాల మేరకు పదిమందితో కూడిన సమన్వయ కమిటీని నియమించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ లోకసభ అభ్యర్థి రాజేందర్‌రావుకు మద్దతుగా నగరంలోని 60 డివిజన్‌లలో పోలింగ్ బూత్ స్థాయిలో ప్రచారం నిర్వహించడానికి, పార్టీని సమన్వయపర్చేందుకు ఈ కమిటీ పనిచేయనుంది.

గంజాయి పట్టివేత

జమ్మికుంట: పట్టణంలో ఇద్దరు యువకుల నుంచి 210 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రవి గురువారం తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన యువకులను సోదా చేయగా గంజాయి లభించిందన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

స్టేడియంలో కుక్కల బెడద







కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో కొద్ది రోజులుగా కుక్కలు బెడద ఎక్కువైంది. వాటిని చూస్తే భయంకరంగా ఉన్నాయని, అవి కరిస్తే తమ పరిస్థితి ఏంటని పలువురు వాకర్స్ వాపోతున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు వాకింగ్ చేస్తుంటారు. అంతుచిక్కని వ్యాధితో ఉన్న కుక్కలు స్టేడియంలో సంచరిస్తుండటంతో భయాందోళన చెందుతున్నారు. నగర పాలక సంస్థ అధికారులు, జంతు సంరక్షణ సంస్థలు, స్టేడియం సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు తేరుకొని కుక్కల బారి నుంచి కాపాడాలని వాకర్స్ కోరుతున్నారు. – కరీంనగర్‌స్పోర్ట్స్

ఓటరు చైతన్యం.. కటౌట్లతో ప్రచారం



ప్రతీ ఓటరు తమ ఓటుహక్కును వినియోగించుకునేలా జిల్లా ఎన్నికల యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే తక్కువగా పోలింగ్ జరిగిన ప్రాంతాల్లో చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తుండగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కటౌట్లు ఆకట్టుకుంటున్నాయి. వాటి వద్ద సెల్ఫీలు దిగుతూ సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. కరీంనగర్ అర్బన్

లక్ష్యం అధిగమించారు

- ఆర్థికంగా ఎదిగిన స్వశక్తి మహిళలు
- వంద శాతం దాటిన బ్యాంకు లింకేజీ రుణాలు

కరీంనగర్‌రూరల్: స్వశక్తి మహిళా సంఘాలకు ఆర్థిక తోడ్పాటు అందించేందుకు ప్రభుత్వం బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తోంది. పలువురు మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు. నాలుగేళ్ల నుంచి నిర్దేశించిన లక్ష్యానికి మించి బ్యాంకర్లు రుణాలను పంపిణీ చేస్తున్నారు. మహిళలు సైతం తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లిస్తున్నారు.

లక్ష్యాన్ని మించి రుణాలు

కరీంనగర్ మండలానికి ఏటా రుణాల పంపిణీ లక్ష్యాన్ని అధికారులు కేటాయిస్తున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.43.24కోట్లు రుణ లక్ష్యం కాగా రూ.53కోట్లు మంజూరు చేసి లక్ష్యాన్ని సాధించారు. కేటాయించిన లక్ష్యాన్ని మించి 122.57శాతం రుణాన్ని అధికంగా మంజూరు చేశారు. మహిళల ఆర్థిక స్తోమత ఆధారంగా గ్రూపులకు రూ.లక్ష నుంచి రూ. 20లక్షల వరకు రుణాలు అందజేశారు. అధికారులు సైతం లక్ష్యాన్ని సాధించేందుకు మహిళా సంఘాలను ప్రోత్సహించారు.



దుర్శేడ్‌లో సమావేశమైన స్వశక్తి మహిళలు

రుణాలను తీసుకోవడంలో ఆసక్తి చూపుతున్న సంఘాలకు వెంటనే మంజూరు చేసేలా చర్యలు చేపట్టారు. రుణాలతో పలువురు మహిళలు వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా ఎదుగుతున్నారు. నెలవారీగా క్రమం తప్పకుండా బ్యాంకు కిస్తీలను చెల్లిస్తున్నారు.

స్త్రీనిధి రుణాల వివరాలు

రుణ లక్ష్యం	రుణాల మంజూరు	శాతం
రూ.5.17కోట్లు	రూ.7.66కోట్లు	149శాతం

రుణాలు సద్వినియోగం

మహిళా సంఘాలకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న బ్యాంకు లింకేజీ రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. లక్ష్యాన్ని మించి అధికంగా రుణాలు మంజూరీ చేశాం. రుణాలను కూడా మహిళలు తిరిగి సకాలంలో చెల్లిస్తున్నారు.
– భార్గవ్, ఏపీఎం, ఐకేపీ కరీంనగర్ మండలం

2023-24 ఆర్థిక సంవత్సరం లింకేజీ రుణ వివరాలు

సంఘాలు	రుణం పొందిన సంఘాలు	లక్ష్యం	మంజూరు
642	634	రూ.43.24కోట్లు	రూ.53కోట్లు

ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదు చేయొచ్చు

- ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ అర్బన్: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల సాధారణ పరిశీలకులకు ఫిర్యాదు చేయవచ్చని ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. కరీంనగర్, చొప్పదండి, మానకొండూరు, సిరిసిల్ల, వేములవాడ, హుజురాబాద్, హుస్నాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులు, సూచనలు, సలహాల కోసం ఎన్నికల సాధారణ పరిశీలకులు, ఐఏఎస్ అధికారి అమిత్ కటారియా ఫోన్ నంబర్ 9177435833 కు ఫిర్యాదు చేయవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు కరీంనగర్ ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌజ్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటారని వివరించారు. ఫిర్యాదు చేసేవారు స్వయంగా కానీ ఫోన్ ద్వారా గానీ ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అలాగే ఎన్నికల వ్యయ పరిశీలకులు అశ్వినీ కుమార్ పాండ్య ఫోన్ నంబర్ 9032659531కు ఎన్నికల వ్యయం సంబంధిత అంశాలపై ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు.

ఇంటర్‌లో 'సహస్ర' విజయభేరి

కరీంనగర్: ఇంటర్మీడియట్ ఫలితాల్లో సహస్ర కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో కె.శివమణి 1000 మార్కులకు 988 మార్కులు, పి.అదిత్య 988, కె.వైభవీలక్ష్మి 976, అమిషా బేగం 975 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో కె.ప్రియాంక 966 మార్కులు, సీఈసీ విభాగంలో పి.అంజలి 945 మార్కులు, జి.రచన 931, పి.మనీషా 925, జె.కావ్య 918 మార్కులు, ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 470 మార్కులకు బి.సంజన 465 మార్కులు, ఎం.రవళి 465, కె.సరస్వతి 460, యు.మనస్విని 458, బైపీసీ విభాగంలో బి.శ్రీజ 420, ఎం.సహస్ర 420, సీఈసీ విభాగంలో ఎం.శ్వేత 454, ఎస్.ఆనందిత 445 మార్కులు సాధించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ సందవేణి వెంకట్, డైరెక్టర్లు ఎస్. రమేశ్, బి.ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వి.రామచంద్రారెడ్డి, అధ్యాపకులు ప్రవీణ్‌లు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న సహస్ర కళాశాల యాజమాన్యం

టెక్నాలజీ నేర్చుకుంటే భవిష్యత్‌లో అవకాశాలు

కరీంనగర్ సిటీ: కామర్స్ విద్యార్థులు సబ్జెక్టు నాలెడ్జ్‌తో పాటు సబ్జెక్టుకు సంబంధించిన టెక్నాలజీని నేర్చుకుంటే భవిష్యత్‌లో మంచి అవకాశాలు అందుకోవచ్చని శాతవాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ హరికాంత్ అన్నారు. నగరంలోని ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో టెక్నాలజీస్ ఫర్ అకౌంటింగ్ అండ్ ఫైనాన్స్ అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సీఏ లాంటి కోర్సులు చేస్తే డాక్టర్లు, ఇంజినీర్లు తదితర వారికి సహాయపడవచ్చని తెలిపారు. రిసోర్స్‌పర్సన్‌గా విచ్చేసిన డాక్టర్ వెంకట్రావు టెక్నాలజీని ఏ విధంగా ఉపయోగించాలో శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ కామర్స్ విద్యార్థులు టెక్నాలజీని వినియోగించి మరింత ముందుకు సాగాలని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.రాజయ్య మాట్లాడుతూ ఆసక్తితో టెక్నాలజీని నేర్చుకుంటే భవిష్యత్‌లో ఉన్నత స్థానంలో ఉండడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. ఎ.సతీశ్‌కుమార్ కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ వర్క్‌షాప్‌లో కామర్స్ అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరికాంత్

బీఎస్‌పీ అభ్యర్థిగా మారపెల్లి మొగిలయ్య నామినేషన్



నామినేషన్ వేస్తున్న మొగిలయ్య

కరీంనగర్: బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ నాయకత్వంలో కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా మారపల్లి మొగిలయ్య గురువారం జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతికి నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మొగిలయ్య మాట్లాడుతూ భారత రాజ్యాంగమే ఏజెండాగా పనిచేస్తున్న పార్టీ ఈ దేశంలో ఎవరి కులాల జనాభా ఎంత ఉందో వారి వాటా అంతా అనే నినాదంతో పని చేస్తుందని తెలిపారు. ఈ నామినేషన్ ప్రక్రియకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిషాని రామచంద్రం, రాష్ట్ర కార్యదర్శి దొడ్డే సమ్మయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు మాతంగి అశోక్, జిల్లా ఇన్‌చార్జిలు మంద బాలయ్య, కల్లెపల్లి రాజేందర్, జిల్లా అధ్యక్షులు దొడ్డె శ్రీనివాస్, జిల్లా సలహాదారులు కడపల విజయ్ కుమార్, మానకొండూరు అధ్యక్షుడు మాతంగి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయండి

కరీంనగర్: కొత్తగూడెంలో ఈనెల 27న జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రత్నం రమేశ్ తెలిపారు. గురువారం సంఘ కార్యాలయంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో కౌన్సిల్ పోస్టర్లు ఆవిష్కరించారు. రాబోయే ఎన్నికల్లో మద్యం, డబ్బులు పంచి గద్దె ఎక్కాలని అనేక ప్రలోభాలు చూపెట్టి ఈ ప్రభుత్వం నీచ రాజకీయాలు చేస్తుందన్నారు. కేవలం మతం ప్రాతిపదికనే ప్రజల్లో విద్వేషాలు సృష్టించి అభివృద్ధి జరగకుండా ఉండేందుకే భావిస్తుందన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం విద్యార్థుల సమస్యల పై నిరంతరం పోరాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రణీత, కావ్య, శిరీష, అజయ్ సిద్ధార్థ, మనోజ్ ప్రేమ్ కుమార్, సంజీవ్‌లు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

డీజే ఓనర్‌పై కేసు

రామడుగు: మండల కేంద్రంలో డీజే నిర్వహించిన ఓనర్ సిరికొండ సాయితేజపై కేసు నమోదు చేశామని రామడుగు ఎస్సై సురేందర్ తెలిపారు. వివరాలు ... బుధవారం రాత్రి డీజే సౌండ్స్ ఉపయోగించి పెళ్లి వేడుకలు నిర్వహిస్తుండగా పెట్రోలింగ్ చేస్తున్న సిబ్బంది గుర్తించి విచారణ జరపడంతో అధికారుల అనుమతి లేకుండా నిర్వహిస్తుండడంతో ఆటోతో పాటు సౌండ్ బాక్సులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి గురువారం కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. డీజే సౌండ్స్ అనుమతి లేకుండా నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై హెచ్చరించారు.

బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు ఓట్లడిగే అర్హత లేదు

కరీంనగర్: బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు బీసీ, ఎస్సీ, ఎస్టీల ఓట్లు అడిగే అర్హత లేదని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ అన్నారు. గురువారం నగరంలో నిర్వహించిన ధర్మ సమాజ్ పార్టీ ఎంపీ అభ్యర్థి చిలువేరు శ్రీకాంత్ నామినేషన్ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ అమలు గురించి అడగడం లేదన్నారు. 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు చట్టసభల్లో బీసీ రిజర్వేషన్ అమలు గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అణగారిన వర్గాల తరపున చిలువేరు శ్రీకాంత్‌ను కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో నిలిపామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు జంగం సాధన, ప్రధాన కార్యదర్శి తాళ్ల నరేశ్, పరమేశ్వరి, బోయిని సదన్, రాకేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు

జమ్మికుంట: పట్టణంలోని మమత ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యంపై కలెక్టర్, జిల్లా వైద్యాధికారి సుజాతకు బాధితుడు రచ్చ రవికృష్ణ గురువారం ఫిర్యాదు చేశారు. పట్టణానికి చెందిన లావణ్యను ప్రెగ్నెన్సీతో పాటు థైరాయిడ్, ఇతర వైద్య పరీక్షలకు తీసుకెళ్లగా శాంపిల్స్ తీసుకొని రిపోర్టులు ఇవ్వకుండా రోజులుగా తిప్పుకుంటున్నారని పేర్కొన్నారు.

కోతకు వచ్చిన వరి దగ్ధం

రామడుగు: దేశరాజ్‌పల్లి గ్రామ పరిధిలోని రైతు జలపతికి చెందిన మూడెకరాల్లోని వరి గురువారం సాయంత్రం దగ్ధమైందని గ్రామస్తులు తెలిపారు. కోతకు వచ్చిన వరి పొలంలో గుర్తు తెలియని వ్యక్తి సిగరెట్ తాగి పడవేయడంతో పూర్తిగా కాలిందన్నారు. కాగా ఫైర్ ఇంజిన్ వచ్చి చుట్టు పక్కల పొలాలకు మంటలు వ్యాప్తించకుండా అదుపు చేయడంతో భారీ ప్రమాదం తప్పిందని , రైతుకు దాదాపు రూ. 2లక్షల మేర నష్టం వాటిల్లిందన్నారు.

రాజేందర్‌రావుకు మద్దతు తెలిపిన సీపీఐ నాయకులు

కరీంనగర్: కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెలిచాల రాజేందర్‌రావు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణలు గురువారం నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డిభవన్‌కు వచ్చి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డిని, పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ మర్రి వెంకటస్వామిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఇండియా కూటమిలో కాంగ్రెస్‌తో పాటు సీపీఐ భాగస్వామ్యం ఉన్నందున సీపీఐ రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి సీపీఐ శ్రేణులు పనిచేస్తారని అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో రాజేందర్‌రావుకు సీపీఐ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ గెలుపు కోసం సీపీఐ, కాంగ్రెస్‌లు కృషి చేయాలని తెలిపారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఏకం కావడం శుభపరిణామం అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు మాట్లాడుతూ తనకు సంపూర్ణ మద్దతు ప్రకటించి గెలుపు కోసం పనిచేస్తామని మాట ఇచ్చిన సీపీఐ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, గుంటి వేణు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కేదారి, మల్లేశ్, శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు అశోక్, గూడెం లక్ష్మీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కవ్వంపల్లి, వెలిచాలలకు కండువాలు కప్పుతున్న చాడ వెంకటరెడ్డి

విద్యాశాఖ కార్యదర్శి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

కరీంనగర్: ఇంటర్మీడియట్ ఫలితాలు ప్రకటించిన తర్వాత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశం రాష్ట్రంలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల అడ్మిషన్లు ప్రభుత్వ ఆధీనంలో జరుగుతున్నాయని చెప్పడాన్ని స్వాగతిస్తున్నామని యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి అన్నారు. గురువారం సంఘ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు సంద గణేశ్ అధ్యక్షతన జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. కార్పొరేట్ విద్యా సంస్థలు చేసిన ప్రవేశాలను తక్షణమే రద్దు చేసే విధంగా ఇంటర్ బోర్డు చర్యలు తీసుకోవాలని అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాతోనే కాకుండా ఆ కళాశాల గుర్తింపును రద్దు చేసే విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. మోసపూరిత ప్రకటనలు చేస్తూ తల్లిదండ్రులను, విద్యార్థులను మోసగిస్తున్నారని వారిపై కేసులు నమోదు చేయాలని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు వారిని నమ్మి ప్రవేశాలు తీసుకోవద్దని కోరారు. సమావేశంలో యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సంద గణేశ్, సాయి, కిరణ్, విజయ్, నవీన్, తిరుపతి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాదం తిరుపతి

అట్టహాసంగా 'సెయింట్‌జార్జ్' వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్‌యూ వైస్ చాన్స్‌లర్ మల్లేశం



విద్యార్థుల నృత్యాలు

కొత్తపల్లి: కొత్తపల్లిలోని సెయింట్‌జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ (సీబీఎస్‌ఈ) వార్షికోత్సవ వేడుకలు గురువారం అట్టహాసంగా జరిగాయి. వేడుకలకు శాతవాహన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ మల్లేశం ముఖ్యఅతిథిగా హాజరై సెయింట్ జార్జ్, ప్యారడైజ్ విద్యాసంస్థల చైర్మన్ డా.పోతిరెడ్డి ఫాతిమారెడ్డితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించేందుకు విశేషంగా కృషి చేయాలని సూచించారు. ఫాతిమారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు ఉన్నతమైన విద్యనందిస్తూ నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్స్ ఎ.భార్గవ్, వి.నిరంజన్, టి.వసంత. అకాడమిక్ సీఈవో ఉమాకాంత్, వైస్ ప్రిన్సిపాల్ మధు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు అలరించాయి.

హుజూరాబాద్ ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా సదాశివ

హుజూరాబాద్: హుజూరాబాద్ ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్‌గా సదాశివ గురువారం బాధ్యతలు స్వీకరించారు. భూముల క్రయవిక్రయాల్లో ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్లు జరుగుతాయని తెలిపారు.